

# పతి భక్తి

* ఊ. రాంరెడ్డి

హల్లో... యిన్‌స్పెక్టర్‌గారేనా?

"యస్."

"చూడండి... బహుశా మీరంత బిజీగా లేరనుకుంటాను.''

"యస్...''

"నేనిపుడు నా రూంలో కూర్చుని మీకు ఫోన్ చేస్తున్నాను... ఎదురుగా ఉన్న కిటికీ అద్దం పగిలిపోయిఉంది... అన్నట్టు మాకు పిల్ల లెవరూ లేరు... దాన్ని నేనాడో చిన్నప్పుడు పగులగొట్టి-నాను... అందులోనుండి బయటకుచూస్తే మా హాలులోని ప్రతిఅంగుళం కూడా కనిపిస్తుంది... హాలుపక్కనే వరండా ఓటుంది ... దాన్నిమధ్యనే కొత్తగా కట్టించాం! అన్నట్టు ఆవరండానే డ్రాయింగ్‌రూంగా కూడా వాడుకుంటాం ...వచ్చిన అతిథులు కూర్చోవడానికి నాలుగు కుర్చీలుకూడా వేసుంచాం!"

"ఇంతకీ అసలువిషయం ఏమిటి..."

''చెబుతున్నా యినస్పెక్టర్‌గారూ... యీవేళ ఆదివారం... యిపుడు సరిగా పన్నెండుగంటలు కావచ్చింది...మావారికీదినం ఆఫీసులేదు ... ఆఫీసు లేకపోతే యింట్లోనే ఉంటారని మీకు తెలుసు."

"అయితే .."

"అన్నట్టు మావారు బ్యాంకిలో పన్చేస్తారు ... యింత పెద్ద యింట్లో మే మిద్దరమే ఉంటాం! యీ లంకంత యింటిని మా నాన్నగారు పోతూ ... పోతూ నాకిచ్చి వెళ్ళిపోయారు -"

"ఓ...అమ్మా...అసలువిషయం..."

''ఉండండి! యింతకుముందే మావారు ఫోంచేసి వరండాలో కూర్చుని పేపరు చూసుకుంటున్నారు ... నేను వక్కలకని ప్రస్తుతం నేనున్న రూంలోకి వచ్చాను...అసలు విషయం...నేనున్న యీ రూము తలుపులు లోపల బిగించేశాను..."

"విషయం చెప్పవమ్మా!

"అలా విసుక్కోకండి! సరిగ్గా అర్ధ గంటముందు నలుగురుదొంగలు హాలులో నుండి వరండాలోకి పోయారు ..."

''ఏమయింది .. క్విక్..."

"నేను వారిని చూడగానే తలుపులు




బిగించుకున్నాను. హాలునుండి వాళ్ళు వరండాలోకి పోవడం స్పష్టంగా కనిపించింది — అన్నట్టు వాళ్ళందరి చేతుల్లో పిస్తోళ్ళున్నాయి..."

"అబ్బబ్బ ... వాళ్ళేమయ్యారో త్వరగా చెప్పవమ్మా!"

"నన్ను చెప్పనివ్వండిమరి! డబ్బు ఎక్కడుందో మర్యాదగా చెప్పమని మావార్ని వాళ్ళు గట్టిగా బెదిరించడం నాకు స్పష్టంగా వినిపించింది..."

"అబ్బ బ్బ బ్బ ..."

"మావారుమాత్రం తక్కువవారా! నాకు తెలీదని అంటూనే ఉన్నారు ... యివ్వకపోతే వాళ్ళు కాల్చిపారేస్తామని కూడా అన్నారు..."

"అయ్యో... త్వరగా అడ్రస్ చెప్పండి; క్విక్..."

"ఏమో నాకు భయంగా ఉంది యిన్‌స్పెక్టర్‌గారూ! యింతకూ పదినిమిషాల క్రితమే పిస్టల్ ప్రేలిన ధ్వనికూడా వినిపించింది."

"భగవాన్!"

"మావారు బాధగా అరిచిన అరుపు కూడా వినిపించింది ... అన్నట్టు మా యింట్లో పదివేలవరకు క్యాష్ ఉంది ... నగలూ ... ఫర్నిచరూ ... హలో ... యిన్‌స్పెక్టరుగారూ ... హలో ... హలో..."